మేడే వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని..



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్, మోండా, రాణిగంజ్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కార్మికులు ఎర్ర జెండాలను ఎగుర వేశారు. కార్మికులు, కర్షకులు పని చేసే ప్రాంతాల్లో మేడే వేడుకలను పండువగా నిర్వహించారు. మోండా డివిజన్ ఓల్డ్‌జైల్‌ఖానా వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు హరిక్రిష్ణ, జయరాజ్, మహేందర్, కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, సంజీవ, దశరథ్, శివ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త కులగణనపై బీసీ నేతల హర్షం



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ నేత జాజుల లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: దేశ వ్యాప్తంగా కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వ ప్రకటన పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని తన నివాసంలో కలసి బీసీ కులగణన పై బీసీ చేసిన పోరాటానికి మద్దతు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘాల పోరాటం ఫలితమే దేశ వ్యాప్త కులగణన అని అందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదులు తెలిపారు.

బీఎంఈయూ అధ్యక్షుడిగా ప్రకాష్



బీఎంఈయూ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రకాష్

రాంగోపాల్‌పేట్: భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా కే ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ జోనల్ అధ్యక్షుడిగా ఉన్న ప్రకాష్‌ను యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గతంలో కే శంకర్ ఈ యూనియన్‌కు అధ్యక్షుడిగా ఉండి గత కొద్ది నెలల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో గుర్తింపు యూనియన్‌గా ఉన్న బీఎంఈయూకు ప్రకాష్ ఎన్నిక కావడం పట్ల కార్మిక వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో యూనియన్ సికింద్రాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు నర్సింగ్‌రావు, జహంగీర్, లక్ష్మినారాయణ, జీఎస్ అష్రాప్ వలి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

కంచర్ల బద్రికి శ్రీకాంతచారి స్మారక అవార్డు



ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యార్థి, ఉద్యమకారుల వేదిక చైర్మన్, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ కంచర్ల బద్రికి శ్రీకాంతచారి స్మారక అవార్డును బుధవారం ప్రదానం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన కంచర్ల బద్రి ఉద్యమ స్ఫూర్తిని గుర్తించిన నింగి నేల– మేము సైతం సంస్థ వారు శ్రీకాంత చారి మెమోరియల్ అవార్డును కంచర్ల బద్రికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అందచేశారు. ఈ సందర్భంగా కంచర్ల బద్రిని పలువురు అభినందించారు.

ఇంటి ముందు పార్కు చేసిన బైక్ మాయం

సనత్‌నగర్: ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన బీఎస్ తపాడియా (46) గత నెల 19న రాత్రి 8.45 గంటలకు తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేసి వెళ్ళాడు. మరుసటి రోజు 20న ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో బైక్ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుతూ..పాడుతూ...

• వైఎంసీఏలో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం • 135 సంవత్సరాలుగా క్రీడల్లో శిక్షణ



వైఎంసీఏలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

రాంగోపాల్‌పేట్: వేసవి శిబిరాలు అంటే వెంటనే గుర్తుకు వచ్చేది వైఎంసీఏనే...కొన్ని దశాబ్ధాల నుంచి వేసవి సెలవుల్లో విద్యార్థులకు అభిరుచి ఉన్న క్రీడల్లో ఆసక్తిని పెంచి ఆహ్లాదాన్ని పంచి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి వైఎంసీఏ కృషి చేస్తోంది.నాటి నుంచి నేటికి అదే పరంపర కొనసాగిస్తూ సికింద్రాబాద్ వైఎంసీఏ ప్రాంగణంలో వేసవి శిక్షణా శిబిరాలు మొదలు కావడంతో చిన్నారులు సందడి చేస్తున్నారు. యువత చెడు అలవాట్ల బారిన పడకుండా క్రీడల ద్వారా వారిని మంచి మార్గంలో నడిపించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో ఏర్పాటైందే వైఎంసీఏ. అలాగే సికింద్రాబాద్ వైఎంసీఏ కూడా అదే స్ఫూర్తితో 135 సంవత్సరాలుగా నుంచి అదే స్ఫూర్తితో యువతకు వేసవి శిబిరాలతో పాటు రెగ్యులర్‌గా క్రీడల్లో శిక్షణ అందిస్తూ వస్తుంది.

క్రీడలు-కళల్లో ...

గత నెల 26వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరాలు ఈ నెల 26వ తేదీన ముగియనున్నాయి. క్రీడలు, వివిధ రకాల కళలు, సంగీతం, లైఫ్ స్కిల్స్ లాంటి 24 అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైఎం



సీఏ ఆవరణలో నిపుణులైన శిక్షకులతో ఈ శిక్షణ అందిస్తున్నారు. సుమారు 250 మందికి పైగా విద్యార్థులు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. బాస్కెట్ బాల్, చెస్, బాడీ ఫిట్‌నెస్, షటిల్ బాడ్మింటన్, జిమ్నాస్టిక్, ఎయిరోబిక్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, కాలిగ్రఫీ, కర్సివ్ రైటింగ్, కీబోర్డ్, గిటార్, వయోలిన్, హిపాప్ అండ్ భోయింగ్, ఫోక్ డ్యాన్స్, భరతనాట్యం, తేక్వాండో, కుంగ్‌ఫూ, అబాకస్, స్కేటింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఫ్యాషన్ అండ్ మోడలింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, పబ్లిక్ స్పీకింగ్, యోగా, పేరెంట్ కాంపిటేషన్ ఒక్కో విద్యార్థికి నెల రోజులకు 3వేల రూపాయలు ఫీజు చెల్లించి ఏదైనా నాలుగు అంశాల్లో శిక్షణ తీసుకోవచ్చు.

క్రీడలకు పుట్టినిల్లు వైఎంసీఏ



క్రీడలు అనగానే గుర్తుకు వచ్చేది వైఎంసీఏనే. ఎంతో మంది గొప్ప బాస్కెట్ బాల్ క్రీడాకారులు ఇక్కడి నుంచే తయారయ్యారు. విద్యార్థులు వేసవి కాలంలో మొబైల్ ఫోన్, టీవీ లాంటి వాటికి అతుక్కుని పోకుండా శారీరక పటిష్టం, మానసిక ఉల్లాసంగా ఉండేందుకు ఇవి దోహదపడతాయి. అభిరుచి ఉన్న వాటిలో శిక్షణ పొందితే వాటిలో రాణిస్తే దేశానికి పేరు తెచ్చే వారవుతారు.

- జయకర్ డేనియల్, వైఎంసీఏ అధ్యక్షులు

చాలా బాగుంది



తమ్ముడు నేను ఇద్దరం కలిసి బాస్కెట్‌బాల్, అబాకస్, కరాటే, డ్యాన్సుల్లో శిక్షణ తీసుకుంటున్నాము.
ఉదయం 5.30 గంటలకు లేచి ఇక్కడి వస్తున్నాము. అన్ని చాలా బాగున్నాయి. ఇక్కడే మధ్యాహ్నం 1గంట వరకు శిక్షణ తీసుకుంటున్నాము. -సుభిక్ష

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



తార్నాకలో సన్న బియ్యం పంపిణి చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కార్యక్రమాన్ని గురువారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి 9వ సర్కిల్ పరిధిలోని తార్నాకలో ప్రారంభించారు. తార్నాక చింతల్‌లోని రేషన్ దుకాణాన్ని సందర్శించి పలువురు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణి చేశారు. బియ్యం పంపిణిపై లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మకమైన నిర్ణయం అన్నారు. పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం అనేక రకాలైన సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, మంత్రి ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

ఈ పథకం పేదలకు వరం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు కిట్టు

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలో గురువారం బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో పలు రేషన్ దుకాణాలను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు అక్కడి లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతల్ కిట్టు మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ పథకం పేదలకు వరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉస్మాన్, శషాంక్, దస్తగిరి అలీ తదితరులున్నారు.

పేదల సంక్షేమం కోసమే..



అడ్డగుట్టలోని రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

అడ్డగుట్ట: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదం సంతోష్ అన్నారు. గురువారం అడ్డగుట్టలోని రేషన్ దుకాణాల్లో ప్రజలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపాలనే ఉద్దేశ్యంతో తీసుకొచ్చిన సన్నబియ్యం పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆదం సంతోష్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంట రాజు సాగర్, మంద సురేష్ పాల్గొన్నారు.



సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్

వేడుకగా పంపిణీ..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో గురువారం ఆహారభద్రత కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్ సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, మెట్టుగూడ డివిజన్లలోని రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మిల్లర్లు, దళారులు కుమ్మక్కై కోట్లు దండుకున్నారు

బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యే శ్రీగణేష్ ధ్వజం



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థికంగా భారమవుతుందని సన్నబియ్యం పంపిణి చేయలేక దొడ్డుబియ్యం పంపిణీ చేసిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ విమర్శించారు. కంటోన్మెంట్ రసూల్‌పురా రేషన్‌షాపులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మిల్లర్లు, దళారులు కుమ్మక్కై దొడ్డుబియ్యం రీసైక్లింగ్ చేసి కోట్లు దండుకున్నారని ఆరోపించారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా మాజీ మంత్రి హరీష్‌రావు బియ్యం క్వాలిటీ బాలేదని పసలేని ఆరోపణలు చేస్తున్నారని, బియ్యం తీసుకున్న ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు షేక్ నయిం. రాజేష్ యాదవ్, మహేష్, అన్నానగర్ మురళి పాల్గొన్నారు.

భర్త, అత్తామామలపై ఫిర్యాదు

సనత్‌నగర్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తింటి కుటుంబ సభ్యులు తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఓ గృహిణి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఫతేనగర్ శివశంకర్‌కాలనీలో తుడి ప్రభాకర్, సంధ్య దంపతులు జీవనం సాగిస్తున్నారు. కొద్దిరోజుల నుంచి సంధ్యను భర్త ప్రభాకర్ శారీరికంగా, మానసికంగా వేధించడం మొదలుపెట్టాడు. అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తకు అత్తమామలు, ఆడపడుచులు, మరిది కూడా మద్దతు తెలిపి తనను హింసిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో పోర్టర్ల ర్యాలీ



సికింద్రాబాద్‌లో మేడే వేడుకల్లో పాల్గొన్న మజ్దూర్ యూనియన్ కార్మికులు

సికింద్రాబాద్: దక్షిణమధ్యరైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు, ఉద్యోగులు ఘనంగా మేడే వేడుకలు నిర్వహించుకున్నారు. పలు కార్యాలయాల వద్ద మేడే జెండాలు ఆవిష్కరించి ఊరేగింపులు నిర్వహించుకున్నారు. చిలకలగూడలోని సంఘ్ ప్రధాన కార్యాయలం నుంచి రైల్వే స్టేషన్ వరకు మేడే ర్యాలీ కొనసాగింది. కార్యక్రమాలకు విశ్రాంత రైల్వే అధికారి ఆర్‌వీఎస్ రాఘవరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనియన్ నాయకులు భరణిభానుప్రసాద్, వీరభద్రరావు, రుద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం..



సనత్‌నగర్: హైదరాబాద్ జిల్లాలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. బేగంపేట సర్కిల్‌లో పరిధిలో బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, కంటోన్మెంట్, రసూల్‌పురా, బోయిగూడ మారేడ్‌పల్లి తదితర ప్రాంతాలు ఉండగా ఆయా ప్రాంతాల పరిధిలో 67 రేషన్ షాపులు ఉన్నాయి. సర్కిల్ పరిధిలో ఆహార భద్రత కార్డుల కింద 2,23,391 మంది లబ్ధిదారులు, అంత్యోదయ ఆహార భద్రత కార్డుల కింద 8,800 మంది లబ్ధిదారులు మొత్తం 2,32,191 మంది లబ్ధిదారులు పౌరసరఫరాల శాఖ బేగంపేట సర్కిల్ పరిధిలో ఉన్నారు. వీరందరికీ సన్న బియ్యం పంపిణీకి ఇప్పటికే ఆయా రేషన్ షాపులకు మాల్ చేరుకుంది. సన్నబియ్యం పంపిణీతో కార్డుదారుల్లో ఆనందం వెల్లివిరిసింది.

సామాజిక ప్రగతికి సేవా సంస్థలు పనిచేయాలి



నోటుబుక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏసీపీ జైపాల్‌రెడ్డి

సికింద్రాబాద్: సామాజిక సేవా కార్యక్రమాలకు పాల్పడే సంస్థలకు తమవంతు సహకారం అందించి ప్రోత్సహిస్తామని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సీతాఫల్‌మండి సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తాకల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏసీపీ జైపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సామల హేమ నోటు బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత విద్యలు అభ్యసించడానికి సామాజిక సేవా సంస్థలు కృషి చేయాలన్నారు. అందరూ విద్యావంతులు కావడం ద్వారా సామాజిక ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, భాగ్యనగర్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యంగౌడ్, మున్నూరు చందు, మాజీ కార్పొరేటర్ బండారు లత పాల్గొన్నారు.



బోయిగూడ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్వర్యంలో..



ర్యాలీలో పాల్గొన్న యూనియన్ నేతలు, కార్మికులు



తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద కార్మిక దినోత్సవ వేడుకలు



కంటోన్మెంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు ఆవరణలో హమాలీ యూనియన్ అధ్వర్యంలో..

ఘనంగా మేడే

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం పలుచోట్ల కార్మికులు వేడుకలు జరుపుకున్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో కార్మికులు సందడి చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. వేర్వేరు చోట్ల ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీగణేశ్ పాల్గొన్నారు.



లాలాపేట లేబర్ అడ్డా వద్ద



హమాల్‌బస్తీలో సీపీఎం అధ్వర్యంలో..



ఉస్మానియా యూనివర్సిటీలో..



అడ్డగుట్టలో ఎంసీపీఐ(యూ) నాయకులు